| | | |
|---|---|---|
| పోస్టర్సు అవీ | ,, | 8,000 |
| పత్రికలకు పబ్లిసిటీ నిమిత్తం | ,, | 20,000 |
| ప్రింట్సు (ఇరవై కాపీలకు) | ,, | 40,000 |
| సెన్సారుఫీజు | ,, | 800 |
| ప్రెస్సు షో | ,, | 1,200 |
| మొత్తం | రు. | 84,500 |

ఈ అంకెలు చూచి, వేలకువేలు తీసుకున్న ఆర్టిస్టులు, రచయితలు, డైరెక్టర్లు, టెక్నీషియన్లు-ఇంత తక్కువేమిటి అని హాస్యాస్పదంగా ఉన్నదని నవ్వవచ్చు. కాని యిప్పటి మన పరిశ్రమదారుల్లో అధికభాగం వేలకువేలు ఇస్తామని అగ్రిమెంట్లు వ్రాసి తీరా రొక్కరూపంగా యిచ్చేటప్పటికి రూపాయకి అణాలు, బేడలూ ఇస్తున్నారు. ఇలాంటి సరస్వతీ ప్రసన్నం కంటె, లక్ష్మీ ప్రసన్నమైన తక్కువ మొత్తాలను రొక్క రూపంగా తమ చేతుల్లో చూచుకొని మనఃపూర్వకంగా పనిచేయడానికి ఏ రచయితగాని ఆర్టిస్టుగాని టెక్నీషియనుగాని వెనుదీయడేమో. ఇంక పెట్టుబడిదారులూ నిర్మాతలూ విషయంలో లక్షల కొద్దీ ఖర్చుపెట్టి చెత్తచిత్రం తీసి చిత్తు అయ్యేకంటె ఒక్క లక్షరూపాయల పెట్టుబడితో కొత్తచిత్రం తీసి లాభం పొందాలనేఎత్తు వేయవచ్చు.

రెండవభాగపు ఖర్చుకే నాలుగయిదు లక్షలు వ్యయపరచే వ్యాపారస్థులు ఉన్నారు. అటువంటివారందరూ వ్యాపారస్థులు అనేకంటే జూదగాళ్ళు అనడం మంచిది. గుర్రపుపందాలు, స్టాకు ఎక్ఛేంజి, కాటన్‌మార్కెటు మొదలయిన వాటిమీద పెట్టినట్టే సినీమా వ్యాపారంలోకూడ ఇటువంటివాళ్ళు పెట్టుతూ ఉన్నారన్న మాట. వ్యాపారదక్షతతో చక్కగా నిర్వహిస్తే-మొదటి భాగంలో సూచించినట్టు లక్ష రూపాయలలో చిత్రం పూర్తి చెయ్యవచ్చు. రెండవ భాగంలోని లక్షరూపాయలున్నూ విడుదలముందు చేయవలసిన ఖర్చు కాబట్టి డిస్ట్రిబ్యూటర్ల వద్దనుండి కాని ఎగ్జిబిటర్ల వద్దనుండి కాని సులువుగా అడ్వాన్సు రూపంగా రాబట్టుకోవచ్చు. అయితే అయిదు, ఆరు లక్షలతో తీసే తెలుగు చిత్రాన్ని అమాంతంగా ఒకలక్ష వ్యయంలోకి దించాలి అంటున్నావే ఎవరివల్ల సాధ్యం అంటే-అది ప్రస్తుతం పరిశ్రమలో ఉన్న ఎవరివల్లా సాధ్యం కాదు. సమర్థుడూ, సంపన్నుడూ, ప్రజ్ఞావంతుడు సాహసికుడు అయినా కొత్తనిర్మాత ప్రవేశించాలి. అంధకారబంధురమైన యీ పరిశ్రమకు ఒక దారి చూపించాలి. అధిక వ్యయప్రయాసల మహారణ్యంలో దారి కానక ఉన్న యిప్పటి పరిశ్రమదారులకు కనువిప్పు తేవాలి.

ఒక్కసారి ఎవరైనా అటువంటి ఇంద్రజాలం చేసి కృతకృత్యులయ్యారో-గొర్రెల మందలాగ వారిని అనుసరించేవారు తెనుగువారిలో అసంఖ్యాకులు. అయితే చిత్రపరిశ్రమలో యీ అధిక వ్యయాల పిల్లికి మెడలో గంట కట్టేవారెవరు?

కథానిక

# బ్రతుకుమీది మమత

"కిరణ్"

పడవ బయల్దేరడానికింకా పాతికగంట వ్యవధి ఉంది. జగన్నాథం తన బెడ్డింగు ఓప్రక్క నుంచి, తనూ ఒకమూల తాపీగా కూర్చుని చుట్ట ముట్టించాడు. జగన్నాథం వయస్సు అరవైపైబడింది. గవర్నమెంటు ఉద్యోగంచేసి, పింఛను పుచ్చుకొంటున్నాడు. నలభయ్యో ఏటనే చత్వారం రావటంవల్ల కళ్ళజోడు బాగా అలవాటయింది. కళ్ళజోడుతీస్తే మొహం బోసిగా ఉంటుంది. ముతకఖద్దరు పింజబోసి ధోవతి కట్టాడు. ఖద్దరులాల్చీ తొడిగి, పైన బొమ్మంచు కండువా వేసుకొన్నాడు. బట్టతలమీద నెరసిన వెంట్రుకలు ఒకటి రెండు ఎండిపోయిన చెరువులోని రెల్లుపూలలా గాలికి చెదిరిపోతున్నాయి.

ఒక చిన్న కునుకు పట్టింది జగన్నాథానికి. మళ్ళీ మెలకువవచ్చి చూసేసరికి దూరాన పాపికొండలు కనిపిస్తున్నాయి. నల్లగా నిటాలుగా నెంట్రీలముఖాలకుమల్లే గంభీరంగా ఉన్న పాపికొండలు జగన్నాథాన్ని క్షణకాలం చలింప

చేసినయ్. సన్ననై, విల్లంబులాగా వంపులతిరిగి, ఆ కొండల రెంటిమధ్య ప్రవహిస్తూన్న గోదావరి ఉరవడి రానురాను అధికమౌతూంది. ఆ కొండల సమీపంలో, ఎన్నో పడవలింతకుక్రితం తల్లక్రిందు లవటం, కొన్ని వందలమంది ప్రాణాలు కోల్పోవటం జగన్నాథం ఎరుగును. గడిదేరిన పడవ వాళ్ళు కూడా అక్కడకు వచ్చేసరికి, ప్రాణాలు పిడికిటిలో పెట్టుకొని,ఎంతో మెలకువతో పడవను నడిపిస్తారు. జగన్నాథంలో ఏదో అకారణభీతి పుట్టింది ఆ కొండలనూ, ఆ మహా ప్రవాహాన్నీ, ఉవ్వెత్తున ఎత్తునలేస్తూన్న ఆ కెరటాలను మానేసరికి. పాపికొండల సమీపంలో పడవ తలక్రిందులయి తేనో... గుండెలు గతుకుమన్నవి. ఒక్కమారుగా కంపించిపోయాడు. ఒళ్ళంతా జలదరించింది. శాలువ మరీ దగ్గరికి లాక్కొని, ముంచిముకొని పోయాడు. ఒక్కసారి పడవలో ఉన్న వాళ్ళందరి వేపు కలయచూచాడు.

అందరూ తనకన్న చిన్న వాళ్ళలాగే కనిపిస్తు న్నారు. తనకు తలనెరసింది. అరవై ఏండ్లు దాటి నవి. నరాల పటుత్వం సన్నగిలింది. ఇపుడు తనకు కళ్ళజోడు లేనిదే చూపు ఆనదు. పదేండ్లుగా గవర్నమెంటు ఫించను అనుభవిస్తున్నాడు. చీకూ చింతా లేకుండా తినడానికి తగినంత పిత్రార్జిత ముంది. తనకు ముప్ఫయేండ్ల కొడుకూ భద్రాచలంలో పశువుల డాక్టరుగా ఉంటూ రెండొందలరూపాయలు తెచ్చుకొంటున్నాడు. కూతుళ్లు కిద్దరికీ, అయిన సంబంధాలుగా చూచి పెళ్ళిళ్లు చేశాడు. ఇక తనకు జీవితంలో ఎలాంటి కొరత లేదు... కాని తనకింకా బ్రతుకుమీద మమకారం తగ్గలేదు...ఇంకా పదేళ్ళపాటు బ్రతకాలనీ, తన చేతులమీదే మనుమళ్ళ పెళ్ళిళ్లుకూడా చేయించాలనీ ఉబలాట పడుతున్నాడు.

మళ్ళీ ఒకమారు పడవలో ఉన్న వాళ్ళందరి వేపూ విమర్శనాదృష్టిలో చూచాడు. యువతీ యువకులిద్దరు జగన్నాథం దృష్టిని ఆకర్షించారు.

జగన్నాథానికి తను చదువుకొనే రోజులు గుర్తుకొచ్చినయ్. తన కాలేజీ రోజులు చాల "రోమాంటిక్" గా గడిచిపోయాయి. ఆరోజుల్లో తను ప్రేమకవిత్వం వ్రాసేవాడు. మళ్ళీ యువకుడైపోదా మనిపించింది. ఆ మధుర జీవితాన్ని నెమరువేసుకొని పులకించిపోయాడు.

పాపికొండలు సమీపిస్తున్నాయ్. "గోదావరి తల్లికి కోటిదణ్ణాలు" అని పాడుకొంటూన్న పడవ వాళ్ళ పాట, జగన్నాథం చెవుల్లో బలవంతాన దూరింది. నల్లటి మేఘాలు ఆకాశాన్ని అలుము కొంటున్నాయి. వర్షంవచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పుడప్పుడూ వీచే చల్లటి గాలులకు వణికిపోతూన్న జగన్నాథం తనశరీరం దౌర్బల్యం ఇతరులు గమనించటం ఇష్టపడలేదు. ఎదుటివాడికి తెలియకుండా తన దుర్బలత్వాన్ని కప్పిపుచ్చుకో వాలని చూచాడు. జేబులోనుంచి, లంకపొగాకు చుట్టొకటితీసి, దానిచివర్ని మునిపళ్ళతో కొరికి అంటించాడు, ఆ విధంగానే నా శరీరానికి కాస్త వెచ్చదనం కలుగుతుందేమోనని. "కాస్త అగ్గింప్పించు బాబూ!" అంటూ వచ్చిన బెస్తపిల్లని ఆపాదమస్తకం చూచాడు. నడుముకు కట్టిన తాటాకుల బుట్ట, బుజాన వల్లె వాటుగా వేసుకొన్న పెద్దవల, మెడలో సముద్రపు గవ్వల దండ...ఇవి జగన్నాథం దృష్టినుంచి తప్పించు కోలేక పోయాయి.

ఊరువులు అర్ధనగ్నంగా కనిపించేటట్లు కాసి కోక బిగించి కట్టింది. కాళ్ళకు పెట్టుకొన్న వెండి కడియాలు, ముక్కున బేసర్లూ, సంజ వెలుగులో జిగజిగ మెరిసిపోతున్నయి. నిగనిగ లాడే స్నిగ్ధసౌందర్యంతో ఆమె ముత్యాల్లాంటి చిరు చెమటబిందువులలో తడిసిన ముంగురులను పైకి త్రోసుకొంటూ, అమాయకపు పల్లెటూరి సోయగాన్ని ఒలికించే ఆ బెస్తపిల్లలో ఒక వినూత్న ఆకర్షణ గోచరించింది జగన్నాథానికి.

తను చదువుకొనే రోజులలో "గ్రామీణ సౌందర్యం" అనే విషయాన్ని ఇతివృత్తంగా తీసుకొని వ్రాసినకథ గుర్తుకొచ్చింది. సరిగా ఇదేలాంటి అమాయకపు పడుచునే ఆధారంగా తీసికొని కథవ్రాసాడు. పత్రికలలోకూడా ప్రచురిత మైనది. ఈ విషయాన్నిగురించి జగన్నాథానికి అనేక నిశ్చితాభిప్రాయాలున్నయ్. పల్లెలలోనే స్వచ్ఛమైన తెలుగుదనం ఉట్టిపడుతూంటుందనే వాడు. పాశ్చాత్య నాగరికతా ప్రభావం సోకని, పల్లెపట్టులే భారత దేశానికి మళ్ళో పూసల్లాంటివనీ, అవే దేశసౌభాగ్యానికి పునాది రాళ్ళనీ భావించే వాడు.

తను ఫించను తీసుకొన్నాక, గ్రామపునరుద్ధర

ణోద్యమంలో తన సాయశక్తులా పనిచేయాలని సంకల్పించుకున్నాడు. కాని ఫించను పుచ్చుకున్న తర్వాత, ఆ విషయాలలో అట్టే శ్రద్ధతీసుకొని పనిచేయటానికి వీలుచిక్కింది కాదు. సంసార తాపత్రయాలతో వ్యవధిలేకపోయింది.

"ఏంటి బాబూ! అట్టా సూత్తారూ? సుట్ట ముట్టించేందుకి అగ్గి బాబూ" అంది బెస్తది కొంటెగా నవ్వుతూ, జగన్నాథం ఉలిక్కిపడ్డాడు. మళ్ళీ తన ఊహా ప్రపంచంలోనుంచి బయటపడి తెప్పరిలుకొని అగ్గిపెట్టె అందించాడు. బెస్తది చుట్ట అంటించుకొని, అగ్గిపెట్టె తిరిగి యిచ్చివేసింది చిలిపిగా నవ్వుతూ. జగన్నాథం తనూ నవ్వాలనుకొన్నాడు. కాని బోసినోరు కనిపించి పోతుందన్న భయంతో ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు. రంగువేసిన బుంగమీసాల మాటున తనబోటి నోటిని దాచుకొన్నాడు.

రివ్వున వీచిన గాలికి, నీటి తుంపురులు జగన్నాథం కళ్ళజోడు మీదపడ్డాయి. కళ్ళజోడు తీసాడు అద్దాలు తుడుద్దామని. పరిసరాలన్నీ మసకలు మసకలైనవి. బెస్తదానికొంటెనవ్వు కొంకెర బింకెరగా అయిపోయింది. ఏమీ కనిపించటం లేదు. మళ్ళీ, కళ్ళజోడు తగిలించుకొన్నాడు.

"బ్రతుకుపై నీకింత మమతెందుకే మనసా
ముద్దుముచ్చటతీరె, మోహాలుతీరె"

అని తత్వాలు పాడుకొంటున్నాడు ఓ మూల కూర్చొన్న గోసాయి. గోసాయి పాటను మరెవ్వరూ వింటూన్నట్లులేదు. అంతా కులాసా కబుర్లు చెప్పుకొంటున్నారు. రానున్న అపాయాన్ని కాస్తయినా ఖాతరుచేయకుండా ఇంత నిశ్చింతంగా ఎట్లా ఉండగలుగుతున్నారాని ఆశ్చర్యపోయాడు జగన్నాథం.

ఉన్నపళంగా గాలి ఉరవడి ఎక్కువైంది. దట్టంగా మేఘాలు కమ్మేసినాయి. ఉరుములతో ఆకాశం దద్దరిల్లిపోతూంది. చిమ్మచీకట్లు కమ్ముకొంటున్నాయి. గాలివీచినపుడల్లా పడవ ఊగిపోతూంది. గాలిహోరులో ఒకరిమాట ఒకరికి వినిపించటంలేదు.

పడవ పాపికొండలని సమీపించింది... సుళ్లు తిరుగుతూ గోదావరి విజృంభించిపోతూంది. ఉవ్వెత్తుగా లేస్తూన్న కెరటాలతోబాటు పడవకూడా లేస్తూంది. అంతవరకూ నిశ్చింతంగా ఉన్న ప్రయాణీకులలో కలవరం ఎక్కువైంది.

పడవవాళ్లు, మరీ మెలుకువతో పడవను నడుపుతున్నారు.

జగన్నాథం తలెత్తిచూశాడు. ఆకాశాన్నంటుతూన్న ఎత్తయిన కొండలూ, కొండల రెంటి మధ్యా, మహావేగంతో ప్రవహించే గోదావరీ, ప్రళయం ముంచుకొనివచ్చేట్లున్న చీకట్లూ... ఇవన్నీ తలుచుకొని కంపించిపోయాడు. గుండెదడ ఎక్కువైంది.

ఉన్నిశాలువను మరింతదగ్గరికి లాక్కొని వణకిపోతూన్న శరీరాన్ని దాచుకొన్నాడు. శరీరమంతా ముడుచుకొని బెదురుచూపులతో మరలా పడవలో ఉన్న వాళ్ళందరికళ్ళల్లోకి చూశాడు వరుసగా. అందరికళ్లల్లో భయం ప్రతిఫలిస్తూంది.

"భోయ్"మని వీచిన గాలికి పడవ సుడిగుండంలో చిక్కుకొంది. పడవవాళ్ళు, పడవని సుడిగుండంనుంచి తప్పించాలని తమ సాయశక్తులా యత్నిస్తున్నారు—

అంతే. అంతవరకే జగన్నాథానికి గుర్తుంది. మళ్ళీ తనకు స్పృహవచ్చేసరికి ఒడ్డున ఉన్నాడు. ఎవరో ఒకరిద్దరు పడవవాళ్ళు మాత్రం తనకు సపర్యలు చేస్తూన్నట్లు తెలిసుకోగలిగాడు. మాట్లాడేందుకుకూడా శక్తిలేదు. "దాహ"మని సైగ చేశాడు. వెచ్చటి పాలొక గ్లాసు తెచ్చి యిచ్చారు. అవి త్రాగిన కొద్దిసేపటిలో తెప్పరిలుకొన్నాడు జగన్నాథం.

"మిగతావాళ్ళేరి?" అని ప్రశ్నించాడు పడవవాళ్ళని అతి నీరసంగా.

"ఎవరు బాబూ!" అన్నాడు వాళ్ళలో ఒకడు.

"వాళ్ళే. పడవలో వాళ్ళంతా" అన్నాడు.

"అళ్ళా బాబూ! పాపం! అంతా ఏట్లో కొట్టుకపోయారు, ఎవడో గోసాయి యీదలేక తన్నుకలాడుతూంటే మావాళ్లే ఒడ్డునసేర్చారు" అంటూన్నాడు వాడు. ఇంతలో మరోవేపునుంచి తప్పతడిసిన కాషాయి గుడ్డల్ని పిండుకొంటూ వీళ్ళనిచేరుకొన్నాడు గోసాయి.

చల్లగా నీళ్ళమీదనుంచి వచ్చిన పిల్లగాలి కెరటానికి జగన్నాథం మనస్సు హాయిమనిపించింది. యువతీయువకుల కిలకిలలూ, బెస్తదాని చిలిపినవ్వూ గుర్తుకొచ్చినయ్ జగన్నాథానికి.